

సారా వద్దు.. జీవితం ముద్దు

సారా రహిత సమాజం కోసం అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. - 8లో



ఇల వైకుంఠం.. ఇదేం అపచారం

కూటమి పాలనలో తిరుమల మందుబాబుల కు అడ్డాగా మారింది. మద్యం విక్ర యాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. - 8లో



న్యూస్‌రీల్

మైనారిటీ గురుకుల ప్రవేశాలకు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రం సమీపంలో మురుకంబట్టులోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో (బ్యాక్‌లాగ్) సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ముస్లిం (బీసీ-ఈ, బీసీ-బీ, బీసీ-సీ (కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 31 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మహిళా ఉద్యోగులు సమస్యలుంటే తెలపండి

- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల పెట్టె ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ , జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు ఏవైనా సమస్యలుంటే ధైర్యంగా తెలియజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల ఫిర్యాదుల పెట్టెను కలెక్టర్, జేసీలు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. ఎటువంటి సమస్యలున్నా ఫిర్యాదు పెట్టెలో లేఖ రూపంలో తెలియజేయవచ్చని చెప్పా రు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మోహన్ కుమా ర్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, ఏపీ జేఏసీ మహిళా విభా గం చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు జయంతి, జనరల్ సెక్రటరీ లత, కో చైర్మన్ శోభ, మెంబర్ సెక్రటరీలు సరిత, పుష్పలత, ఇతర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

'సీఎంసీ'లో మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాలో ఉన్న సీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిందని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంసీ ఆసుపత్రుల్లో విశ్రాంత ఉద్యోగులు హెల్త్ కార్డులతో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొందవచ్చన్నారు. చిత్తూరు సీఎంసీ ఆసుపత్రిలో ఈ ఏడాది మార్చి 2వ తేదీ నుంచి 2028వ సంవత్సరం మార్చి 2వ తేదీ వరకు, వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో 2027 జూన్ 22 వరకు, రాణిపేట ఆసుపత్రిలో 2028 మార్చి 2వ తేదీ వరకు వైద్య చికిత్సలు పొందేందుకు ప్రభుత్వం గుర్తింపు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్థానిక సంస్థల ఉప ఎన్నిక

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల్లోని పలు పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీగా ఉన్న పదవులకు ఈనెల 27వ తేదీన ఉప ఎన్నిక నిర్వహించి భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి రూరల్, సదుం, తవణంపల్లి మండల పరిషత్ అధ్యక్ష స్థానాలు, పెనుమూరు, పీలేరు మండలాల్లో కో ఆప్షన్ సభ్యులకు ఎన్నిక నిర్వహించనున్నారు. తిరుపతి ఎంపీపీ పదవికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన విషయం విధితమే. అదే విధంగా సదుం ఎంపీపీ ఎల్లప్ప అనారోగ్యంతో మృతి చెందారు. తవణంపల్లి ఎంపీపీ గీత తన పదవికి రాజీనామా చేయడం వల్ల ఆ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు.

సమారోహం.. సంస్కృతికి ఛత్రం

సంస్కృత భాష పరిరక్షణ.. సంస్కృతి మనుగడే లక్ష్యంగా బోధన చేస్తున్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన నాలుగో దీక్షాంత సమారోహం సంస్కృతికి ఛత్రం పట్టింది. పతకాలు.. పట్టాలు.. పీహెచ్‌డీలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందం అవధులు దాటి, ఉప్పొంగింది.

ఘనంగా జాతీయ సంస్కృత వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం

- 22 మందికి బంగారు పతకాలు ప్రదానం
- 564 మందికి డిగ్రీ, పీజీ..75 మందికి పీహెచ్‌డీ పట్టాల అందజేత
- సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యంగా వర్సిటీ అడుగులు



స్నాతకోత్సవంలో గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, వర్సిటీ అధికారులు



ఓవరాల్ టాపర్‌గా ఐదు పతకాలు సాధించిన తండ్రి అమిత్ విక్రమ్‌ను ముద్దాడుతున్న కుమార్తె, కుమారుడు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాలుగో దీక్షాంత సమారోహం అట్టహాసంగా జరిగింది. తిరుపతి మహతి ఆడిటోరియం వేదికగా గురువారం జరిగిన వర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి అధ్యక్ష హోదాలో హాజరైన వర్సిటీ చాన్సలర్ పద్మ భూషణ్ ఎన్ గోపాలస్వామికి వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రీ సంస్కృత విద్యాపీఠం మాజీ వీసీ పద్మశ్రీ డాక్టర్ వీఆర్ పంచముఖి ఆన్‌లైన్ విధానంలో హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం సంస్కృతభాష పరిరక్షణకు మూలకేంద్రమని కొనియాడారు. ప్రాచీన సంస్కృత భాషను సంరక్షిస్తూ, ఆధునిక వైజ్ఞానిక తత్వాలను అనుసంధానిస్తూ, భారతీయ జ్ఞాన పరంపరను భావిభారతావనికి అందిస్తున్న ఉత్తమ క్షేత్రంగా వర్సిటీ విరాజిల్లుతుందన్నారు. త్వరలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను సంస్కృత భాషతో అనుసంధానం చేసేందుకు విశేష పరిశోధనలు చేస్తామని తెలిపారు.

నూతన పరిశోధనల వేదిక ఎన్ఎస్‌యూ

వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వర్సిటీ ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పరిశోధనలకు వర్సిటీ వేదికవుతోందన్నారు. సంస్కృత భాషాభివృద్ధే వర్సిటీ లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. దేశంలో పూర్తి స్థాయిలో అన్ని విభాగాల్లో సంస్కృత భాష బోధిస్తున్న ఏకైక వర్సిటీ జాతీయ సంస్కృత వర్సిటీ అని కొనియాడారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి వర్సిటీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాకోర్సులను సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

హృదయాన్ని స్పృశించిన సన్నివేశాలు

ఎన్ఎస్‌యూ నాలుగో స్నాతకోత్సవంలో పట్టాలు, బంగారు పతకాలు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు కలిసిన సన్నివేశాలు వీక్షకులు హృదయాన్ని కట్టిపడేశాయి. పీజీ ఓవరాల్ టాపర్‌గా నిలిచి 4 పతకాలతో పాటు, ఒక బంగారు పతకం సాధించిన అమిత్ విక్రమ్ కుమారుడు, కుమార్తె తండ్రి సాధించిన పతకాలను పట్టుకుని ముద్దాడిన సంఘటన పలువురిని కలచి వేసింది. అలాగే పీజీ జ్యోతిష్యశాస్త్రంలో టాపర్‌గా నిలిచిన కేరళకు చెందిన ఎంపీ అన్లే విద్యార్థి తల్లి షీజా కేరళ నుంచి వచ్చి, కుమార్తెను ముద్దాడి అక్కున చేర్చుకుని ఆనందబాష్పాలు రాల్చింది. అలాగే పీహెచ్‌డీ పట్టా అందుకున్న దివ్యాంగుడు కే హరిబాబుకు అధికారులు మోకాళ్లపై నిలుచుని పట్టా అందజేశారు. అనంతరం భార్య, ఆయన కుమారుడు డాక్టరేట్ పట్టాను చూస్తూ ఆనందోత్సాహంలో మునిగితేలారు.



బంగారు పతకాలను సాధించిన విద్యార్థుల గ్రూప్ ఫొటో

మెరిసిన 22 మంది బంగారు కొండలు

విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ చూపి ప్రథమస్థానం సాధించిన 22 మంది విద్యార్థులు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారిలో శాస్త్రీ విభాగంలో వై జానకి, బీఏలో జి సంధ్య, బీఎస్సీలో వి త్రిపురసుందరి, బీఎస్సీ యోగాలో టి అభినయ పసిడి పతకాలు అందుకున్నారు. ఆచార్య విభాగంలో సునీతాప్రుష్టి, వైష్ణవి, అన్నా, అనురిధ్ భరద్వాజ్, మహదేవన్, దేవప్రసాద్ భట్, అజిత్ సింగ్, విక్రమ్, తునుశ్రీ, హేమసుందర్‌రావు, శుభశ్రీ, అస్రఫ్ అలమ్‌ఖాన్, కిషోర్ పాండే, సాగరిక సర్కార్, ఎంఎలో సంధ్యబాయ్, ఎమ్మెస్సీలో అభినయ్‌శ్రీ, ఎమ్మెస్సీ యోగాలో ఎం దేవీప్రసన్న బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు బీఈడీలో మోనికా బొహిదర్, ఎంఈడీలో జయక్రిష్ణరాయ్ ఉన్నారు.

ఐదు మహాగ్రంథాల ఆవిష్కరణ

రామానుజ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సురపురం శ్రీనివాసాచార్య రచించిన సిద్ధాంత చింతామణి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ విభాగం ద్వారా శివరామ భట్ సంపాదకీయంలోని మహస్వినీ పత్రికను, అనంతరం జ్యోతిష్య విభాగం డీన్ కృష్ణేశ్వర్ ఝా ఆధ్వర్యంలో వేదవేదాంగం, డాక్టర్ సోమనాథ దాస్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో వర్సిటీ న్యూస్ లెటర్ శేముషీ గ్రంథాలను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, డీన్లు దక్షిణామూర్తి శర్మ, రజనీకాంత శుక్లా, పరీక్షల నియంత్రణాధికారి కే సాంబశివమూర్తి పాల్గొన్నారు.

564 మందికి డిగ్రీ, పీజీ పట్టాలు.. 75 మందికి పీహెచ్‌డీలు

వర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో భాగంగా 2023-24 అకడమిక్ విద్యాసంవత్సరానికి సంబంధించి 75 మంది విద్యార్థులకు విద్యావారిధి(పీహెచ్‌డీ) పట్టాలను అందజేశారు. అలాగే 564 మంది విద్యార్థులకు ఆచార్య, ఎంఏ, ఎమ్మెస్సీ, బీఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ యోగాథెరఫీ, సర్టిఫికెట్, డిప్లొమో పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.



బంగారు పతకాలను సాధించిన ఆనందంలో తలపాగాలను గాలిలోకి విసిరేస్తున్న విద్యార్థులు



పీహెచ్‌డీ అందుకున్న వికలాంగుడు హరిబాబుతో కుమారుడు, భార్య



పసిడి పతకం పొందిన కుమార్తె పీఎం అన్లేను ముద్దాడుతున్న తల్లి షీజా

ఓవరాల్ టాపర్‌గా అమిత్ విక్రమ్, జానకి

వర్సిటీలో ఆచార్య (పీజీ) స్థాయిలో విద్యార్థి కేఎస్ అమిత్ విక్రమ్ ఓవరాల్ టాపర్‌గా నిలిచి సుమారు ఐదు పతకాలను సాధించారు. అలాగే శాస్త్రి (డిగ్రీ) కోర్సులో ఓవరాల్ టాపర్‌గా నిలిచిన వై జానకి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ప్రాక్-శాస్త్రిలో (ఇంటర్) ప్రథమస్థానంలో నిలిచిన లక్ష్మీ ప్రసన్న బంగారు పతకం అందుకున్నారు.



ఓవరాల్ టాపర్స్‌గా నిలిచి పత్రాలు అందుకుంటున్న జానకి, అమిత్ విక్రమ్

సారా నిర్మూలనకు ప్రణాళికలు

- సారా అనర్థాలపై అవగాహన కల్పించండి
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా చట్టరీత్యా నేరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటు సారాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమం అమలులో ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే పీడీ యాక్ట్ కు గురవుతారని హెచ్చరించారు. నాటుసారా వినియోగం వల్ల కలిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చిత్తూరు అర్బన్, రూరల్, కార్వేటినగరం, నగరి, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల మండలాల్లోని 52 గ్రామాల్లో నాటుసారా తయారీ, వినియోగం ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు.

ప్రత్యేక కార్యాచరణ..

జిల్లాలో నాటుసారాను నిర్మూలించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కేటగిరీల వారీగా గ్రామాలకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులను నియమించి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. నాటుసారా తయారీకి ప్రధాన ముడి సరుకుగా వాడే నల్లబెల్లం అమ్మకాలను నియంత్రించాలన్నారు. నాటు సారా తయారీదారులను గుర్తించి కళాజాతలు, గ్రామ సభలు, గోడపత్రికలు, కరపత్రాలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీఓల ద్వారా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. నాటుసారా తయారు చేసే వారికి ప్రత్యామ్నాయంగా జీవనోపాధులు కల్పించడానికి చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405 కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా పై సంబంధిత శాఖలతో కలసి పోలీస్ యంత్రాంగం పనిచేస్తోందన్నారు. చట్ట రీత్యా నేరమైన సారా తయారీ, అమ్మకాలు, తదితరాల కారణాల వలన పట్టుబడితే జరిమానాలు విధిస్తామని హెచ్చ రించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తహశీల్దార్‌లు, ఇతర సంబంధిత అధికారులు హాజరయ్యారు.

పీఎం యోగా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ప్రధాన మంత్రి యోగా అవార్డుకు దర ఖాస్తు చేసుకోవాలని జిల్లా సెట్విన్ సీఈఓ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గు రువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025 ప్రధానమంత్రి యోగా అవార్డుకు జాతీ య, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగాలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన, యోగా ప్రోత్సహించిన వ్యక్తులు, సంస్థలు నిర్ణీత ప్రా ఫార్మాలో ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవచ్చన్నారు. www.innovateinina.mygov.in/pm-yoga- awards-2025) వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0877- 2286921, 94405 73537, 70364 28762 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

శ్రీసిటీ కంపెనీలకు సీఐఐ అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న మోండెలీజ్ ఇండియా ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించిన శ్రీసిటీలోని మూడు పరిశ్రమలకు '2024 సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డ్స్' దక్కాయి. విశాఖపట్నం నోవోటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మాదిరెడ్డి ప్రతాప్ ఈ అవార్డులను అందజేశారు. శ్రీసిటీకి చెందిన మొండెలెజ్ ఇండియా, కెలాగ్స్, డానియెలి కంపెనీలు ఈ పురస్కారాలను అందుకున్నాయి. ఇందులో మొండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డ్ కింద బంగారు పతకం దక్కింది. 2024 సంవత్సరానికి బెస్ట్ సేఫ్టీ పర్ఫార్మర్‌గా ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును కెల్లాగ్స్ అందుకుంది. ఇక డానియెలి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డ్ కింద ఇంజినీరింగ్ విభాగంలో గోల్డ్ పురస్కారం సొంతమైంది. విజేతలకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయనున్నట్లు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి పలు అంశాలపై, సంఘం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన నాడు-నేడు పనులను కొనసాగించాలన్నారు. పాఠశాలలు మూతపడేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడితే ఆందోళనలు తప్పవన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారంపై పోరాడేందుకు తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. టీచర్లకు విడుదల చేయాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. క్లస్టర్ సమావేశాల్లో, సీనియారిటీ జాబితాల ప్రక్రియలో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, సమస్యలను మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లి సూచనలను స్వీకరించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ మాఫియా!

- రేపటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం
- విస్తరిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోరు
- టాస్ నుంచి మ్యాచ్ ముగిసే దాకా పందాలు
- ఊబిలోకి జారుతున్న క్రికెట్ అభిమానులు
- ఆన్‌లైన్ ద్వారానే లావాదేవీలు



గుడిపాల : క్రికెట్ బెట్టింగ్ మాఫియా చాపకింద నీరులా సాగుతోంది. ముఖ్యంగా ఐపీఎల్ సీజన్‌లో ఎక్కువగా ఉంటోంది. క్రికెట్ బుకీలు ఏకంగా తిష్ట వేసి క్రీడాభిమానులను ఈ రొంపిలోకి దింపి సొమ్ములు చేసుకుంటున్నారు. క్రికెట్ పిచ్చి ఉన్న పలువురు ఈ ఊబిలోకి దిగి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే చాలు యువత మ్యాచ్‌లను తిలకించేందుకు ఎంతో ఉత్సాహం చూపుతుంటారు. అదే సమయంలో వారి ఉత్సాహాన్ని సొమ్ము చేసుకోవడానికి బుకీలు రంగంలోకి దిగుతుంటారు. క్రికెట్ అంటే అభిమానమా..మీ పేవరేట్ టీమ్ గెలుస్తుందనే నమ్మకం మీకుందా.. నిజంగా ఉంటే బెట్టింగ్ కట్టచ్చు కదా.. సరదా తీరుతుంది.. డబ్బులు గెలుచుకోవచ్చు..అంటూ వారిని చిన్నగా ఊబిలోకి దించుతున్నారు.

జిల్లాలోని పలు నియోజకవర్గంలోని మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ఈ వ్యవహారం గుట్టుగా సాగుతోంది. బెట్టింగ్ అంతా దాదాపుగా ఫోన్‌లోనే జరుగుతుంది. ఇరువర్గాలను ఫోన్‌లోనే కాంటాక్ట్ చేసి బెట్టింగ్ కాయిస్తారు. గెలిచిన వారి నుంచి కమీషన్ పొందుతారు.పట్టణాలు, పల్లెల్లోని యువకులను టార్గెట్ చేస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ కారణంగా చిత్తూరు నియోజకవర్గంలో ఎంతో మంది యువకులు అప్పులపాలైన సంఘటన లు లేకపోలేదు.మరికొందరు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

ప్రతి బాల్‌కో రేటు

టాస్ వేసే సమయం నుంచి బ్యాటింగ్ ఎవరు ఎంచుకొంటారు... బౌలింగ్ ఎవరు చేస్తారు... నుంచి బెట్టింగ్ ప్రారంభమవుతుంది.ఏ ఆటగాడు ఎన్ని పరుగులు చేస్తారు.బాల్‌కు ఎన్ని పరుగులు వస్తాయి..ఎవరు గెలుస్తారు..ఎన్ని పరుగులతో మ్యాచ్ పూర్తవుతుంది.ఇలా ప్రతిదానికీ ఒక పందెం ఉంటుంది.

మొదలైన జోరు

గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు అప్పుడే మొదలైంది. రేపటి నుంచి ఐపీఎల్–2025 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమమై.. మేనెల 25వతేదీన ముగుస్తాయి. ఇందులో బెట్టింగ్‌ల జోరు అప్పుడే ఊపందుకుంది. ఎక్కువగా చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, ముంబయి టీమ్‌లపై యువకులు బెట్టింగ్‌లు కాస్తున్నారు.

ఫోన్‌లోనే మంతనాలు

బెట్టింగ్ వ్యవహారం మొత్తం ఫోన్‌లోనే సాగుతోంది. చాలాచోట్ల ఎస్..నో..ఓకే...డన్..ఈటింగ్ వంటి కోడ్ లాంగ్వేజీని దీనికోసం వాడుతుంటారు. క్రికెట్‌పై పెద్దగా పరిజ్ఞానం లేకున్నా ఆడుతుంది.. గెలుస్తుంది...ఓడుతుంది అనే సూత్రాలతో పందేలు కాస్తుంటారు.చాలా మంది టీవీలు చూస్తూనే పందేలు కడుతుంటారు.గ్రౌండ్‌లో చూసే ఆటకు, టీవీల్లో చూసే వారికి మూడు బంతుల సమయం తేడా ఉంటుంది. బంతి బంతికి ఆట ఎలా ఉంటుందో ముందే తెలుసుకొని బెట్టింగ్ కాసేవారి జేబులను బుకీలు గుల్ల చేస్తున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారో? ఎవరు ఓడిపోతారో అనే కాకుండా ఎవరు ఎన్ని పరుగులు చేస్తారు...ఈ ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయనే కోణంలోనూ పందాలు కాస్తారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేసేవారు కొన్ని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.ఆ తరువాత మ్యాచ్‌ను ప్రత్యక్షంగానూ పరిశీలిస్తూ పందేలు కాస్తారు. మ్యాచ్ చూసేందుకు ఒక మొబైల్, బెట్టింగ్ కాసేందుకు మరో మొబైల్ వినియోగించి ఆన్‌లైన్‌లో క్రికెట్ బుకీలు సంప్రదింపులు జరుపుతుంటారు. బార్‌లు, ఇళ్ల మధ్య స్థావరాలు ,క్రికెట్ గ్రౌండ్‌లు ఏర్పాటు చేసుకొని వ్యవహారాన్ని చక్కబెట్టుకొంటున్నారు.

సారా వద్దు.. జీవితం ముద్దు

చిత్తూరు కలెక్టరేట్ : సారా వద్దు.. జీవితం ముద్దు అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నాటు సారా రహిత సమాజం అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రజలు తమ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మకాలు చేసినా టోల్ ఫ్రీ నంబర్ 14405కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పుంగనూరు : పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. ఈ మేరకు ఎస్ఐ లోకేష్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పెద్దపంజాణి మండలం రాయల్ పేటకు చెందిన శంకరప్ప (40)గా గుర్తించారు. ఈ మేరకు బంధువులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వసతిగృహాల్లో వైద్య సిబ్బంది ఉండాలి



సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సాంఘిక సంక్షేమ (ఎస్సీ) వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను పూర్తిగా భర్తీ చేయాలన్నారు. వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల చాలా మంది వార్డెన్‌లు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కామాటి, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఎస్సీ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వసతి గృహంలో డాక్టర్, నర్సు రెగ్యులర్‌గా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మురళి, భాస్కర్, షణ్ముగం, మహేష్ పాల్గొన్నారు.

బోయకొండలో వేలం పాట వాయిదా

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో వివిధ హక్కులపై లీజుకిస్తూ నిర్వహించాల్సిన వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఈఓ ఏకాంబరం ప్రకటించారు. ఐదు హక్కులపై వేలం పాటను అధికారులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వేలం పాటదారులు పాల్గొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో ఈనెల 28వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

గంగవరం: లారీని ఎదురుగా కారు ఢీకొట్టిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. పలమనేరు వైపు నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ లారీని ఎదురుగా అజాగ్రత్తగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న పృథ్వీ(22), పక్క సీట్లో కూర్చున్న సూర్య(21) ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ట్యాంకర్ పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని.. భర్త ఇంటి ఎదుట ధర్నా

- మోసగించాడని భార్య ఆందోళన



భర్త ఇంటి ముందు కుటుంబంతో కలిసి ధర్నా చేస్తున్న భార్య రమ్య

గంగవరం : వారిద్దరూ ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు.. ఒకరికొకరు ఇష్టపడ్డారు.. కులాంతర వివాహం చేసుకున్నారు. పెళ్లి చేసుకున్నా ఆరు మాసాలకే కట్టుకున్న భార్యను వంచించి వదిలేసి.. వెళ్లిపోయాడు.. దీంతో భర్త రాక కోసం నెల రోజులు పాటు ఆమె నిరీక్షించింది.. చేసేది లేక గంగవరం గ్రామంలోని తన భర్త ఇంటి ముందు గురువారం తనకు న్యాయం చేయాలంటూ ఆమె ధర్నాకు దిగింది. బాధితురాలు కథనం మేరకు మబ్బువారిపేట గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె రమ్య, గంగవరం గ్రామానికి చెందిన భరత్ ఇద్దరూ కలిసి ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. అయితే ఇద్దరూ కలిసి జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. భరత్ అందుకు ఒప్పుకోకుండా ఇంట్లో అతడికి సంబంధాలు చూస్తున్నారని, వెంటనే పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతానంటూ ఆమెని మభ్యపెట్టడంతో ఇద్దరూ కలిసి వివాహం చేసుకున్నారు. అలా జరిగిన వారి వివాహం జీవితం ఆరు మాసాలకే పటాపంచలైంది. వివాహం అనంతరం ఇద్దరూ తిరుపతి, ముళబాగిల్ ప్రాంతాల్లో కాపురం పెట్టారు. అతడికి ఎలాంటి పని లేకపోవడంతో ఆమె మెడికల్ షాపులో పనిచేస్తూ భర్తను పోషించేది. అంతలో భరత్ కుటుంబీకుల నుంచి ఒత్తిడి రావడంతో కొన్ని నెలల తరువాత ఇద్దరూ కలిసి గంగవరానికి రాగానే ఆమెపై దాడికి పాల్పడ్డారంటూ ఆమె పేర్కొంది. నీ సామాజిక వర్గం తక్కువదని.. మా బిడ్డను ఎలా పెళ్లి చేసుకుంటావంటూ భర్త కుటుంబీకులు ఆమెను చిత్రహింసలకు గురిచేశారంటూ ఆరోపించింది. అప్పట్లో ఆమె పోలీసులను ఆశ్రయించగా ఇరువురూ కలిసి స్టేషన్‌లో రాజీ కుదుర్చుకున్నారు. ఆ తరువాత ఇద్దరూ కలిసి ముళబాగిల్‌లో నివాసం ఉండేవాళ్లు. కొన్ని రోజులు తరువాత మళ్లీ తన భర్త కుటుంబీకుల నుంచి ఫోన్‌కాల్స్ రావడంతో ఉన్నట్టుండి ఆమెను అక్కడే విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడంటూ ఆమె ఆరోపించింది. అక్కడ దాదాపు 20 రోజులు ఒంటరిగా గడిపి తిరిగీ ఆమె పుట్టింటికి చేరింది. ఎన్నిసార్లు తన భర్తకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తనకు న్యాయం కోసం గంగవరంలోని తన భర్త ఇంటి ముందు కుటుంబంతో సహా ధర్నాకు దిగింది. తన భర్త వచ్చే వరకూ ఎన్నాళ్లు అయినా అక్కడే నిరీక్షిస్తానంటూ ఆమె తెలిపింది. స్పందించిన పోలీసులు ధర్నా చేస్తున్న ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అందుకు ఆమె ఒప్పుకోలేదు. ఇద్దరినీ కలుపుతామంటూ పోలీసులు హామీ ఇచ్చారు. తన భర్త కుటుంబీకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తనకు న్యాయం చేయాలంటూ ఆమె పోలీసులను కోరింది.

కొత్తపల్లి సంత మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ పట్టు

- వేలంలో ఇరువర్గాల మధ్య పోటాపోటీ
- రూ.9.15 లక్షలకు దక్కించుకున్న నేత



వేలం పాటను నిలుపుకొని అధికారులకు నగదును అందజేస్తున్న జయచంద్రారెడ్డి

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం) : కూటమి నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పోలీసులను రంగంలోకి దించినా మరోమారు కొత్తపల్లి మిట్ట సంత మార్కెట్‌ను వైఎస్సార్‌సీపీ పట్టు నిలుపుకుంది. ఎప్పుడూ లేని విధంగా నగరి డీఎస్పీ, కార్వేటినగరం సీఐ, మరో ఇద్దరు ఎస్ఐలు, 20 మంది పోలీస్ సిబ్బంది, మరో ప్రత్యేక దళాలు 20 మంది నడుమ నిర్వహించిన సంత వేలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టు నిలుపుకుని మార్కెట్‌ను సొంతం చేసుకున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతకు గురువారం పంచాయతీ అధికారులు వేలం పాట ప్రకటించారు. ఇరువ్గాల మధ్య పోటా పోటీగా కొనసాగిన వేలం పాటలో ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి రూ.9.15 లక్షలతో దక్కించుకున్నారు. ఎన్నడూ లేని విధంగా వేలం పాటకు పోలీసు బలగాలు మోహరించడంపై గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

రోడ్డుపై చెత్త వేయొద్దన్నందుకు దౌర్జన్యం

చిత్తూరు అర్బన్ : చెత్తను కుండీలో వేయాలని, రోడ్డుపై వేయవద్దని చెప్పిన పారిశుద్ధ్య కార్మికుడిపై ఒకరు దౌర్జన్యం చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. గురువారం చిత్తూరులోని ఎంజీఆర్ వీధిలో బాబు అనే కార్మికుడు పారిశుద్ధ్య పనులు చేస్తున్నాడు. లోకేష్ అనే వ్యక్తి తన ఇంట్లోని చెత్తను తీసుకొచ్చి రోడ్డుపై వేస్తుంటే, డస్ట్‌బిన్‌లో వేయాలని కార్మికుడు చెప్పాడు. దీంతో అసహనానికి గురైన లోకేష్, కార్మికుడిపై దౌర్జన్యం చేశాడు. కలత చెందిన కార్మికుడు, తన తోటి సిబ్బందితో కలిసి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లోకేష్‌ను పిలిపించి, పోలీసులు మందలించడంతో వివాదం సమసిపోయింది.

పేకాటరాయళ్ల అరెస్టు

- రూ.12 వేలు స్వాధీనం

గుడిపాల : పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.12,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపాల మండలంలోని శ్రీరంగంపల్లె పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేయగా నలుగురు నిందితులను పట్టుకొని అరెస్టు చేశామన్నారు. మిగతా ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

- టైర్ పంచర్‌తో ఉలిక్కిపడ్డ ప్రయాణికులు
- ఊపిరి పీల్చుకున్న స్థానికులు



కార్వేటినగరం సమీపంలో పంచర్ అయిన ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుల నిరీక్షణ

కార్వేటినగరం : చిత్తూరు నుంచి పుత్తూరుకు వస్తున్న బస్సు గురువారం కార్వేటినగరం సమీపంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున శబ్దంతో పాటు దుమ్ములేచి పోవడంతో బస్సులోని ప్రయాణికులతో పాటు, స్థానికులు ఉలిక్కిపడ్డారు. అక్కడ ఏం జరిగిందో అక్కడున్న వారికి అర్థం కాలేదు. ప్రయాణికులు భయభ్రాంతులకు గురై బస్సు నుంచి దిగారు. తీరా చూస్తే బస్సు ముందు టైర్ పంచర్ అయినట్లు డ్రైవర్ గుర్తించారు. అయితే 5 అడుగుల దూరంలో పెద్ద కల్వర్టు ఉంది. అలాగే అదే ప్రాంతంలో 33 కేవీ విద్యుత్ స్తంభం ఉండటంతో మరింత భయభ్రాంతులకు గురయ్యారు. టైర్ పంచర్ అయిన విషయాన్ని గుర్తించిన డ్రైవర్ అప్రమత్తంగా బస్సును రోడ్డు వైపు మళ్లించి ఆపడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులతో పాటు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు నాణ్యమైన టైర్లతో బస్సు సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంతకీ ఎవరీ అబ్బాయి!

- 2 నెలలుగా రిమ్మర్స్ స్కూల్‌లోనే..



రిమ్మర్స్ పాఠశాలలో ఉంటున్న యువకుడు

పలమనేరు : ఎవరి బిడ్డో తెలియదు.. ఏ ఊరో చెప్పడం లేదు. ఎలాంటి వివరాలు నోట రావడం లేదు. మూడు నెలల కిందట పలమనేరు మండలంలోని బేరుపల్లిలో మూతబడిన ప్రభుత్వ బడి వద్ద ఉంటుంటేవాడు. గమనించిన స్థానికులు ఆ 22 ఏళ్ల అబ్బాయి చిరునామా తెలుసుకునేందుకు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు అతడిని రెండు నెలల కిందట పట్టణ సమీపంలోని నడింపల్లి వద్ద గల రిమ్మర్స్ బుద్ధిమాంద్యం గల పాఠశాలలో చేర్పించారు. బుద్ధి మాంద్యం కారణంగా తానెవరో చెప్పలేకపోతున్నాడు. కానీ అతని ఆచూకీ కోసం తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా ఉంటే వచ్చి తీసుకెళ్లవచ్చునని స్కూల్ నిర్వాహకులు తనూజ తెలిపారు. ఇతర వివరాల కోసం 98850 40345 అనే నంబరును సంప్రదించాలని సూచించారు.

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా?

పలమనేరు : కూటమి నేతలు ఎలాంటి అక్రమాలు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదు. అదే వైఎస్సార్‌సీపీ వాళ్లు ఏ చిన్న తప్పు చేసిన ఆఘమేఘాలపై వేధింపులకు దిగుతున్నారు. ఇది కొన్నాళ్లుగా పలమనేరులో అధికారుల తీరు. వివరాలు ఇలా..బొమ్మిదొడ్డికి చెందిన సుబ్రమణ్యంనాయుడు ఇంటి వెనుక పశువులను కట్టేసుకునేందుకు కొంత మేర చెరువు స్థలంలో రేకుల షెడ్డు వేశాడు. దీనిపై పచ్చనేతల సమాచారంతో స్థానిక రెవెన్యూ అధికారులు హుటాహుటిన గురువారం షెడ్డును జేసీబీతో తొలగించేశారు. ఇదే విధంగా అక్కడే చెరువు స్థలాన్ని ఆక్రమించుకున్న కూటమి నేతల జోలికెళ్లకపోవడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. కూటమి నేతలకు అయితే నిబంధనలకు చెల్లుచీటీ పాడుతున్నారు. వేరే పార్టీకి అయితే నిబంధనల పేరుతో వేధింపులకు దిగుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టపగలే చైన్ స్నాచింగ్

- యువతి మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగలు



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన చైన్‌స్నాచర్ల దృశ్యాలు

నగరి : నగరి మున్సిపాలిటీ తిరుపతి రోడ్డు 7కే క్రికెట్ టర్ఫ్ పక్కనే ఉన్న వీధిలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. బాధితురాలు భార్గవి తెలిపిన వివరాల మేరకు. గుండ్రాజుకుప్పంకు చెందిన ఆమె నగరి పట్టణంలోని బ్యాంకులో పని నిమిత్తం వెళ్లింది. అక్కడ పనిముగించుకొని ఇంటికి బయలుదేరేందుకు ఆటోలో కొంత దూరం మరో మహిళతో కలిసి 7 కే క్రికెట్ టర్ఫ్ వద్దకు చేరుకొంది. అక్కడి నుంచి ఇద్దరూ స్వగ్రామానికి నడుచుకుంటూ బయలుదేరారు. అప్పటికే ఇద్దరు హెల్మెట్ వేసుకొని దారిపక్కనే ఆగి ఉన్నారు. వారిని పట్టించుకోకుండా నడుస్తూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వీరిని దాటుకొని ముందుకెళ్లినవారు కొంతదూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో తిరిగీ ఎదురుగా రాగా బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి భార్గవి మెడలోని బంగారు గొలుసును పట్టుకొని లాక్కెళ్లాడు. లాక్కెళ్లిన సరడు, తాళిబొట్టు, కాసులతో కలిపి సుమారు 3 సవరాలని బాధితురాలు వాపోయింది. కాగా వారు బైక్‌లో వెళ్లే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. దాని ఆధారంగా సీఐ విక్రమ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం అయింది. గురువారం ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు

ఇలవైకుంఠం.. ఇదేం అపచారం

వేంకటాద్రి నిలయం.. పరమ పవిత్రం..భక్తికి.. ముక్తికి..ఆధ్యాత్మికత క్షేత్రం..కలియుగ వైకుంఠవాసుడు కొలువైన ఇలవైకుంఠంగా పేరుగాంచిన పుణ్యస్థలం..ఇంతటి ప్రాధాన్యం శేషాచలంపై భక్తులు ఎంతో భక్తిభావంతో ప్రవర్తిస్తారు. అందుకే ఇక్కడ మద్యం, మాంసం, మత్తు పదార్థాలు, పానీయాలకు చోటు లేదు. ఇక్కడంతా ఆధ్యాత్మిక చింతనే కనిపిస్తుంది. అయితే కాల'కూటమి' అధికారంలోకి వచ్చింది. తిరుమలలో అపవిత్రత రాజ్యమేలుతోంది. నిత్యం మందుబాబులు చిందులేస్తుండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇలవైంకుంఠంలో ఇదేం రచ్చ అని ఆవేదన చెందుతున్నారు.



తిరుమలలో మందుబాబును ప్రశ్నిస్తున్న పోలీసులు

- తిరుమలలో మందుబాబులు హల్‌చల్
- నియంత్రించలేకపోతున్న విజిలెన్స్, పోలీస్
- అడ్డదారిలో తిరుమలకి మద్యం

తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారు వెలసిన దివ్య క్షేత్రం తిరుమల. స్వామివారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. పవిత్ర పుణ్యక్షేత్రం కావడంతో తిరుమలలో మాంసం, మత్తు పదార్థాలు, పానీయాలపై టీటీడీ నిషేధం విధించింది. తిరుమల పవిత్రతను, భక్తులకు భక్తిభావాన్ని పెంపొందించేలా అనేక చర్యలు అమలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమలలో మందుబాబులకు అడ్డాగా మారింది. రోజుకో ప్రాంతంలో రెచ్చిపోతున్నారు. తిరుమలలో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పీకలదాక మద్యాన్ని సేవించి తిరుమలలో హల్‌చల్ చేస్తున్న ఘటనలు అనేకం. శ్రీవారి ఆలయానికి సమీపంలోని శ్రీ భూవరాహస్వామి ఆలయం వద్ద ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో ఓ మహిళా భక్తురాలిపై దుసురుగా, అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తిరుమలలో మద్యం ఎంత కావాలన్నా సేవిస్తానని, ఎంత మద్యం కావాలో చెప్పు.. నీకు తెచ్చిస్తాం అంటూ ఊగిపోయాడు. పోలీసులకు కావాలంటే కూడా అమ్ముతా అంటు రెచ్చిపోయాడు. ఆ విషయం విజిలెన్స్ కానిస్టేబుల్‌కి సైతం తెలుసు అంటూ విర్రవీగాడు. వెంటనే అక్కడికి చేరుకున్న విజిలెన్స్ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

నిద్దురోతున్న నిఘా

టీటీడీ నిత్యం మూడంచెల భద్రత నడుమ నిఘా వ్యవస్థ పనిచేస్తూ ఉంటుంది. భక్తుల రక్షణ, శ్రీవారి ఆలయ భద్రత నిర్వహణను టీటీడీ విజిలెన్స్, స్టేట్ పోలీస్, ఎస్పీ, విజిలెన్స్ వింగ్, ఇలా అనేక విభాగాలు తిరుమలలో నిత్యం పహారా కాస్తుంటాయి. తిరుపతి నుంచి మద్యం తిరుమలకు రాకుండా అలిపిరిలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా వారి కళ్లు గప్పి తనిఖీలను దాటుకుని తిరుమలకు చేరుకుంటున్నారు. పోలీస్ శాఖ నుంచి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు భద్రత ప్రమాణాలు చేపడుతుంటే.. సీవీఎస్వో, వీజీఓ, ఏవీఎస్వో, వీఐ, ఇతర అదనపు సిబ్బంది ఆలయ భద్రతతో పాటు భక్తులకు రక్షణ కల్పిస్తూ ఉంటారు.

గంజాయి మత్తులో భక్తులపై దాడి

ఈ ఘటన జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే కొందరు యువకులు మద్యం, గంజాయి మత్తులో డీటైప్ క్వార్టర్స్ వద్ద హల్‌చల్ చేశారు. మేము లోకల్.. మమల్ని ఏమీ చేయరంటూ అనధికార వ్యక్తులు జానాల్ని భయభ్రాంతులకు గురిచేశారు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరంటూ భక్తులపై దాడికి దిగారు. ఓ భక్తుని తలపై బలమైన ఆయుధంతో మోది గాయాలపాలు చేశారు.

తిరుమలలో యథేచ్ఛగా అక్రమ మద్యం

తిరుమలలో చిన్న గంజాయి ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు యథేచ్ఛగా దొరుకుతున్నాయి. భారీ స్థాయిలో మత్తు పదార్థాలను నిఘా కళ్లు గప్పి తిరుమలకు తరలిస్తున్నారు. రోడ్డు మార్గం మీదుగా కొంతమేర అక్రమార్కులు తనిఖీ సిబ్బంది కళ్లు గప్పి తరలిస్తుంటే.. మరి కొంతమంది మామండూరు, అన్నమయ్య నడక మార్గాల మీదుగా తిరుమలకు అక్రమ మద్యం తరలిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో సరైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతోనే మద్యం సరఫరా అవుతున్నట్లు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

తిరుమలలో ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుంది?

తిరుమలలో ఎక్సైజ్ శాఖ సీఐ స్థాయి అధికారితో పాటు సిబ్బంది కూడా ఉన్నారు. అయితే ఈ శాఖ పనితీరు రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. తిరుమలలో ఎక్సైజ్ పోలీసులు ఉన్నారా? లేదా అన్న అనుమానం సైతం భక్తులు వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనం ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలే కారణం. తిరుమలలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ విభాగం అధికారులు తిరుమలలో అక్రమ మద్యం, ఇతర మత్తుపదార్థాలను గుర్తించి సీజ్ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ ఏ విభాగం అధికారులు తిరుమలలో అక్రమ మద్యం, గంజాయి విక్రయాలపై దృష్టి సారించకపోవడం గమనార్హం. అలాగే ఎక్సైజ్ శాఖకు సంబంధించిన స్పెషల్ టాస్క్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్ టీమ్‌లు సైతం నిర్వీర్యంగానే కనిపిస్తున్నాయి. తిరుమలలో ఎక్సైజ్ పోలీసులు ఉన్నా కూడా లేనట్లే అని భక్తులు వాపోతున్నారు.